ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 26 నవంబరు 2024

ఆ టీచర్ వద్దు..!

గుత్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాడిపత్రి రోడ్డు ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని బిల్కిస్ సుల్తానా వ్యవహార శైలి బాగా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ రవినాయక్, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తమ పిల్లలను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, వాతలు పడేలా కొడుతున్నారని వాపోయారు. ఆమెను వెంటనే బదిలీ చేయాలని, లేదంటే తమ పిల్లలను బడికి పంపేది లేదని అన్నారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ సయ్యద్ రసూల్, మాజీ కౌన్సిలర్ బాషా తదితరులు ఉపాధ్యాయినిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రీచార్జ్ చేస్తేనే కరెంటు..!



- విద్యుత్ కనెక్షన్లకు కొత్త స్మార్ట్‌మీటర్లు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు
- మొదటి విడతలో 2.93లక్షల మీటర్లు బిగింపు
- మొబైల్ రీచార్జ్ తరహాలో ప్రీపెయిడ్ చేయాల్సిందే

వివరాలు 6లో..

తుస్సుమన్న ఓటీఎస్..!



- గత సర్కార్ మోసం
- జిల్లాలో 33,043 మంది లబ్ధిదారులు
- రూ.19 కోట్ల చెల్లింపు
- ఏళ్లు గడుస్తున్నా అందని పత్రాలు
- నగదు వెనక్కి ఇవ్వని వైనం

వివరాలు 7లో..

అహుడాను అగ్రస్థానంలో నిలుపుతా



- నూతన అధ్యక్షుడు టీసీ వరుణ్
- అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం

వివరాలు 6లో..

వలపు వలలు

వైసీపీ నేతల పైశాచికం



- మాయ మాటలతో లైంగిక దాడులు
- యువతి పెళ్లి చెడగొట్టిన ఓ నాయకుడు
- కాపురం చెడగొట్టుకుని.. ఒంటరిగా మహిళ

అనంతపురం క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు, అకృత్యాలు ఒక్కొక్కటిగా బయట పడుతూనే ఉన్నాయి. తాజాగా పలువురు మహిళా వలంటీర్లను లొంగదీసుకుని, వారి జీవితాలను నాశనం చేసిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. నెలకు కేవలం రూ.5 వేలు ఇస్తూ.. వెట్టి చాకిరీ చేయించుకున్న వైసీపీ ప్రభుత్వం.. ఎన్నికల సమయంలో వారిని రాజకీయాలకు వాడుకుంది. మళ్లీ అధికారంలోకి వస్తామని, పార్టీకి పనిచేస్తేనే కొనసాగిస్తామని ఒత్తిడి చేసి మరీ పనిచేయించుకుంది. ఆ పార్టీ నాయకులు కొందరిని వ్యక్తిగతానికి వాడుకున్నారు. మహిళా వలంటీర్లను లైంగికంగానూ వాడుకున్నారు. వలంటీర్ పోస్టు తామే ఇప్పించామని, తాము చెప్పినట్లు వినకపోతే ఎలా అని వాడుకున్నారు. అప్పటి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులతో సన్నిహితంగా ఉంటూ.. వార్డుల పరిధిలో పెత్తనం చెలాయించారు. 'దేఖో మై రౌడీయిజం..' అన్నట్లుగా లేని బలాన్ని ఉన్నట్లు ప్రదర్శిస్తూ.. కొందరు మహిళా వలంటీర్లను ఆకర్షించారు. తమతో ఉంటే 'మహా రాణులే..' అన్నట్లుగా, రాజ్యం ఏలొచ్చన్నట్లుగా నమ్మించారు. కొందరు ఆ మాయలో పడగా, మరికొందరు కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అయిష్టంగానే లొంగిపోయారు. ఇలా మాయపడో పడిన వివాహితలు కట్టుకున్నవారికి దూరమయ్యారు. వివాహం కానివారికి సంబంధాలు వచ్చి.. వెనక్కు వెళ్లిపోతున్నాయి. ఒక యువతి పెళ్లి పీటమీదకు వచ్చే సమయంలో రద్దు అయింది. ఇప్పుడు గౌరవం లేదు.. గౌరవ వేతనమూ లేదు. వారి బతుకు అగమ్యగోచరంగా మారింది.

యువతిని వాడుకుని..

అనంతపురం నగరంలో ఓ యువతి వలంటీర్‌గా ఎంపికైంది. ఓ వైసీపీ కార్యకర్త ఆ అమ్మాయిపై కన్నేశాడు. పరిచయం పెంచుకున్నాడు. వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతల వద్ద తిరుగుతూ తన గొప్ప అంత.. ఇంత అని చూపించుకుని ప్రలోభ పెట్టాడు. తనను ప్రేమిస్తున్నాడేమో.. పెళ్లి చేసుకుంటాడేమో అని ఆమె భ్రమలో పడింది. కానీ అతనికి అప్పటికే పెళ్లయింది. ఆ విషయం ఆ యువతి వద్ద దాచాడు. ఫొటోలు తీసుకున్నారు. లోబరుచుకున్నాడు. లైంగికంగా వాడుకున్నాడు. హద్దులు దాటాక.. ఆ యువతికి విషయం తెలిసింది. తన ఖర్మ ఇంతే అనుకుంది. ఇటీవల ఆమెకు పెళ్లి కుదిరింది. వైసీపీ కార్యకర్తకు ఆ విషయం తెలిసింది. తనతో గడిపిన ఫొటోలు, వీడియోలను వరుడికి చూపించాడు. అంతే..! పెళ్లి ఆగిపోయింది. ఇంతకంటే శాడిజం ఏముంటుంది..? పోలీసులకు ఫిర్యాదు చేద్దామంటే.. పరువు బజారున పడుతుందేమోనని బాధితురాలు లోలోన కుమిలిపోతోంది.

బతుకును చెరిపిన పచ్చబొట్టు


అనంతపురం నగరంలో ఓ కార్పొరేటర్ భర్త కారణంగా వలంటీరు జీవితం పాడైపోయింది. పెళ్లయిన ఆమెను తన ప్రాబల్యంతో లొంగదీసుకున్నాడు. మాయలో పడేశాడు. దీంతో ఆమె ఆ చోటా నాయకుడి పేరును తన చేతిపై పచ్చబొట్టుగా వేయించుకుంది. అంత వరకూ వెళ్లింది వ్యవహారం. కొన్నాళ్లకు ఆమె భర్తకు విషయం తెలియడంతో వదిలేశాడు. అప్పటికిగానీ ఆమెకు విషయం అర్థం కాలేదు. జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేక ఒంటరి జీవితం గడుపుతోంది.

ఉపాధి కోసం వస్తే ట్రాప్

అధికార పార్టీ నాయకుల వద్దకు ప్రజలు వెళ్లడం సహజం. సమస్యల పరిష్కారం కోసమో, ఉద్యోగం, ఉపాధి కోసమో వారిని ఆశ్రయిస్తుంటారు. వైసీపీ హయాంలోనూ ఇలాగే జరిగింది. కానీ, అలా వచ్చినవారిలో కొందరు మహిళలను ట్రాప్ చేశారు. మహిళలు, యువతులు వస్తే కొందరు వైసీపీ నాయకులు వక్ర దృష్టితో చూశారు. సచివాలయ వ్యవస్థలో చొరబడి.. మహిళా వలంటీర్ల జీవితాలను పాడు చేశారు. వలంటీర్ పోస్టులు ఇప్పించి, పార్టీ పేరు చెప్పుకుని తమ అవసరాలు తీర్చుకున్నారు. అనంతపురం నగరంతోపాటు శింగనమల, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో ఇలాంటి వ్యవహారాలు చాలానే జరిగాయని వైసీపీ వర్గీయులే అంటున్నారు.

సింగిల్ ఇండెంట్..!

- హెచ్చెల్సీ ఏపీ వాటాపై అధికారుల నిర్ణయం
- ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని ఎంచుకున్న కర్ణాటక



హెచ్చెల్సీ

రాయదుర్గం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ వాటా నీటిని సింగిల్ ఇండెంట్‌గా తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు కర్ణాటక, ఆంధ్ర వాటా నీరు ఆంధ్ర సరిహద్దులోని 105 కి.మీ. వరకు ప్రవహించేవి. తన వాటా నీటిని పది రోజుల పాటు నిలిపివేయాలని కర్ణాటక ప్రభుత్వం బోర్డును కోరింది. దీంతో బోర్డు ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని అమలు చేసేందుకు సిద్ధమైంది. ఏపీ వాటా నీరు తగిన స్థాయిలో సకాలంలో చేరడం లేదు. దీంతో కర్ణాటకతో పాటు ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని అనుసరించే విషయంపై అధికారులు చర్చించారు. చివరకు సింగిల్ ఇండెంట్‌ను డిసెంబరు 1వ తేదీ నుంచి తీసుకోవాలని నిర్ణయించారు.

ఇవీ.. వాటాలు

కర్ణాటకకు 1200 క్యూసెక్కులు, ఆంధ్ర వాటా రెండు వేల క్యూసెక్కుల నీటిని బోర్డు అందిస్తోంది. జలాశయంలో 192 టీఎంసీల నీరు లభ్యమవుతుందని అంచనా వేసి, వాటాలను కేటాయించింది. హెచ్చెల్సీ కింద కర్ణాటక వాటా 15.09 టీఎంసీలు కేటాయించింది. ఇందులో 14.525 టీఎంసీల నీటిని ఇప్పటికే వాడుకనాన్నారు. మరో 0.566 టీఎంసీల నీరు అందాల్సి ఉంది. ఆంధ్ర వాటా కింద 29.434 టీఎంసీలు కేటాయించారు. ఇందులో 21.360 టీఎంసీలు ఇప్పటికే అందాయి. మరో 8.074 టీఎంసీల నీరు అందాల్సి ఉంది.

ప్రవాహ నష్టం మనకే..

తుంగభద్ర జలాశయం నుంచి రెండు రాష్ట్రాల వాటా నీటిని ఒకేసారిగా 105వ కి.మీ. వరకు విడుదల చేసుకుంటారు. ఆంధ్ర సరిహద్దు వరకు ప్రవాహ నష్టం, లీకేజీలు తదితర వాటిని రాష్ట్రాల నిష్పత్తుల ప్రకారం లెక్కిస్తారు. హెచ్చెల్సీ ఆయకట్టులో పంటల కోత దశవరకూ వాటా నీరు సరిపోదని భావించిన కర్ణాటక.. ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని ఎంచుకుంది. డిసెంబరు 1 నుంచి తమ వాటా నీటిని నిలిపివేయాలని, 10వ తేదీ నుంచి పునరుద్ధరించాలని బోర్డును కోరింది. ఈ నేపథ్యంలో జలాశయం నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు డిసెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రవాటా నీరు మాత్రమే ప్రవహిస్తాయి. దీంతో నీటి నష్టాలను ఆంధ్ర పూర్తిగా భరించాల్సి ఉంటుంది.

ఆపే పరిస్థితి లేదు..

ఆంధ్ర సరిహద్దు నుంచి ప్రారంభమయ్యే హెచ్ఎల్ఎంసీ, జీబీసీ పరిధిలో పంటలు కోతదశకు చేరుకున్నాయి. ఆలస్యపు ఖరీఫ్, ముందస్తు రబీ కింద సాగుచేసిన పంటలకు నీరు ఇంకా అవసరముంటుంది. ఇప్పటికే హెచ్ఎల్ఎంసీలో వరికోతలు ప్రారంభమయ్యాయి. నీటి అవసరం మాత్రం జీబీసీకి ఉంటుంది. తాగునీటి అవసరాలకు పీఏబీఆర్‌లో నిలువ చేసుకుంటారు. తాగునీటితో పాటు సాగుకు ఎంపీఆర్‌లో కూడా నిల్వ చేస్తారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 258 క్యూసెక్కుల నీరు హెచ్చెల్సీ నుంచి చేరుతుండగా, ఎంపీఆర్‌లో 855 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఏపీ సరిహద్దులో 1846 క్యూసెక్కుల నీరు అందుతోంది. కర్ణాటకతో పాటు నష్టాలను అంచనా వేసి ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని కూడా అనుసరిస్తే ఎంపీఆర్ పరిధిలో సాగు చేసిన పంటలకు కొంత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పదిరోజుల పాటు నీటి సరఫరాను నిలుపుదల చేసుకుంటే తాగునీటికి కూడా సమస్య తలెత్తే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. దీంతో కర్ణాటక ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని అనుసరించి నీటి సరఫరాను నిలుపుదల చేసుకున్నప్పటికీ, సింగిల్ ఇండెంట్‌గా తమ వాటా నీటిని తీసుకోవాలనే నిర్ణయానికి అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది.

ఇంకో పది టీఎంసీలు..


జిల్లాకు తాగునీటి అవసరాల కోసం కేసీ కెనాల్ మళ్లింపు జలాలు రెండు టీఎంసీలు అదనంగా తీసుకోవాల్సి ఉంది. ఇలా పది టీఎంసీల నీరు జిల్లాకు రావాల్సి ఉండడంతో జలాశయంలో హెచ్చెల్సీకి నీటి మట్టం అనుమతించేవరకు కేటాయించిన జలాలను పూర్తిస్థాయిలో తీసుకునేందుకు ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని అనుసరించకూడదని నిర్ణయించామని అధికారులు అంటున్నారు. దీంతో కర్ణాటక తన వాటా నీటిని డిసెంబరులో ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు, జనవరిలో ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు రెండు విడతల్లో 20 రోజుల పాటు నీటి సరఫరాను నిలుపుదల చేసుకున్నప్పటికీ ఆంధ్రా వాటా నీరు మాత్రం యథావిధిగా వస్తాయని అధికారులు తెలిపారు.

ఉత్తుత్తి సస్పెన్షన్..!

- ఎంపీపీ పెద్దన్నను టార్గెట్ చేసిన విశ్వ
- మంత్రి కేశవ్ పేరు ప్రస్తావించినందుకేనా..?



ఎంపీపీ పెద్దన్న



విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): 'సమస్యల పరిష్కారం కోసం ఆర్థిక మంత్రి, మన నియోజకవర్గ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సహకారం తీసుకుందాం. మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం..' అన్నందుకు ఆయన పదవికి ఎసరు పెట్టారు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి. ఆగస్టు ఒకటో తేదీన బెళుగుప్ప మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ సందర్భంగా ఎంపీపీ పెద్దన్న.. మంత్రి పయ్యావుల కేశవ్ సహకారం కోరుదామని ప్రస్తావించారు. ఆ మాటలను కొందరు వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. 'ఏదేళ్లూ మీరే ఎంపీపీ..' అని అప్పట్లో చెప్పిన విశ్వేశ్వర రెడ్డి.. ఆ ఒక్క మాటతో కత్తి కట్టారు. వైసీపీ నుంచి పెద్దన్నను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మూడు రోజుల క్రితం ఓ తెల్లకాగితంపై ఈ విషయాన్ని రాసి.. ప్రకటన విడుదల చేశారు. మంత్రి పేరును ప్రస్తావించారని, టీడీపీ నాయకులతో సన్నిహితంగా ఉంటున్నారని ఆరోపిస్తూ.. ఎంపీపీ పదవికి రాజీనామా చేయాలని ఆయనపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ పరిణామాలతో వైసీపీలో స్తబ్దత నెలకొంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి ఈ సస్పెన్షన్ విషయమే తెలియదట. పార్టీ నాయకులు, కార్యకర్తలు అడిడితే.. 'సస్పెన్షనా..? అదేమీ లేదే..' అన్నారట. దీంతో విశ్వేశ్వర రెడ్డి డ్రామా నడిపిస్తున్నారని పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు.

పొమ్మనలేక పొగ

ఎంపీపీ పెద్దన్నను రాజకీయంగా ఎదుర్కొనలేక.. పరోక్షంగా ఇబ్బంది పెడుతున్నారని వైసీపీ నాయకులు అంటున్నారు. ఎంపీపీ పెద్దన్నకు 12 మంది ఎంపీటీసీల మద్దతు ఉంది. పార్టీ జిల్లా నాయకత్వం కూడా అనుకూలంగానే ఉంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఆయనకు మద్దతు ఇస్తున్నారని సమాచారం. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేసే అవకాశం ఉంటుందని, అది కూడా జిల్లా అధ్యక్షుడి చేతిలో ఉంటుందని వైసీపీ నాయకులు అంటున్నారు. తెల్ల కాగితంపై ప్రకటన ఇచ్చినంతమాత్రాన చర్యలు తీసుకున్నట్లు కాదని అంటున్నారు. విశ్వ తీరును సొంత పార్టీవారే తప్పు పడుతున్నారు. కురుబ సామాజికవర్గానికి చెందిన శ్రీరంగాపురం ఎంపీటీసీ వరలక్ష్మి పేరును తెరపైకి తెచ్చి, ఆ సామాజికవర్గానికి దగ్గర కావాలని విశ్వేశ్వరరెడ్డి ఇలా చేస్తున్నారని అంటున్నారు.

గుట్టుగా.. మెట్టు



మెట్టు గోవిందరెడ్డి

- కాపు వర్గీయులపై చర్యలు
- దుర్గం వైసీపీ ప్రక్షాళన దిశగా..

రాయదుర్గం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పార్టీ కొనసాగుతూ.. అంతర్గతంగా బీజేపీ నాయకుడు కాపు రామచంద్రారెడ్డికి సహకరిస్తున్నవారిపై వైసీపీ నాయకత్వం దృష్టి సారించింది. ఇప్పటికే ఇద్దరు మండల కన్వీనర్లతో రాజీనామా చేయించింది. పార్టీ కాపు ప్రభావం ఏమాత్రం ఉండకూడదని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెట్టు గోవిందరెడ్డి పావులు కదుపుతున్నారు. ప్రక్షాళన దిశగా ఆయన గోప్యంగా అడుగులు వేస్తున్నారు. పార్టీకి సహకరించేవారినే సమన్వయకర్తలుగా నియమించుకోవాలని, కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని మెట్టును పార్టీ అధినాయకత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో కణేకల్లు మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, డి.హీరేహాళ్ మండల కన్వీనర్ వన్నూరుస్వామి చేత రాజీనామా చేయించారు. వన్నూరుస్వామి కాపు రామచంద్రారెడ్డితో కలిసి కర్ణాటకలోని సండూరులో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేశారు. దీన్ని వైసీపీ అధినాయకత్వం సీరియస్‌గా తీసుకుంది. ఆయనతో కలిసి ప్రచారంలో పాల్గొన్నవారిపై చర్యలు తీసుకునేందుకు నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం.

కాపు మద్దతుదారుల ఫిర్యాదులు

మెట్టు గోవిందరెడ్డిపై కాపు మద్దతుదారులు వైసీపీ అధినాయకత్వానికి ఫిర్యాదులు పంపుతున్నట్లు సమాచారం. కాపు డైరెక్షన్‌లో కొందరు విజయవాడకు వెళ్లి.. అధినాయకత్వాన్ని కలిసే ప్రయత్నం చేశారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. కానీ అపాయింట్‌మెంట్ దక్కలేదని తెలిసింది. మరోవైపు కాపు రామచంద్రారెడ్డి వైసీపీలోకి రీ ఎంట్రీ ఇస్తున్నారనే ప్రచారం ఆయన వర్గీయులు జోరుగా చేస్తున్నారు. ఆ దిశగా తన వర్గీయుల ద్వారా జగన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు కాపు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని అంటున్నారు. జమిలి ఎన్నికలు వస్తే తానే వైసీపీ అభ్యర్థిని అని కాపు రామచంద్రారెడ్డి తన అనుయాయులతో అంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. కాపు ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు మెట్టు గోవిందరెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ శ్రేణులను గట్టిగా హెచ్చరిస్తున్నారు. రాయదుర్గంలో పరిస్థితిని చక్కదిద్దాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి పై నుంచి ఆదేశాలు వచ్చాయని అంటున్నారు. కాపు వాసన లేకుండా చూడాలని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.



కాపు రామచంద్రారెడ్డి

ఓం.. శివోహం..!



ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు

శివాలయాలలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి. వందలాది మంది భక్తులు ఆలయాలకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించుకున్నారు. మహిళలు ఆలయాల ఆవరణలో దీపాలు వెలిగించారు. కార్తీక దీపాలను నీటిలో వదిలారు. అనంతపురం నగరంలోని మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో భక్తులు స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. కాశీ విశ్వేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రికి శయనోత్సవం నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మూడోసారి..!



శాంతభూషణ్‌రెడ్డి తోటలో కేబుల్‌వైర్ కట్‌చేసిన దృశ్యం

యాడికి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దైవాలమడుగు పొలాలలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్ల చోరీ పరంపర కొనసాగుతోంది. ఈ నెల 20 నుంచి ఇప్పటికి మూడుసార్లు దొంగలు పడ్డారు. నలుగురు రైతులకు చెందిన ఎనిమిది మోటార్ల కేబుల్‌వైర్లను ఆదివారం రాత్రి కత్తిరించుకుపోయారు. సుమారు 200 మీటర్ల కేబుల్ వైరు చోరీ అయ్యిందని బాధిత రైతులు శాంతభూషణ్ రెడ్డి, తిరుమల రెడ్డి, వెంకట రెడ్డి, చంద్రప్ప వాపోయారు. ఈ నెల 20న ఎనిమిది మంది రైతుల తోటల్లో, 22న ముగ్గురు రైతుల తోటల్లో కేబుల్ వైరు చోరీ అయ్యింది. పోలీసులు దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.



తిరుమలరెడ్డితోటలో కేబుల్‌వైరు కట్ చేసుకుని వెళ్లిన దొంగలు

ప్రకృతి గీసిన చిత్రాలు..!



వినువీధిని చీల్చుకు
వస్తూ భానుడు..
వడివడిగా అడుగులు
వేసే వేళ..
రెక్కలు తొడిగిన ఆకాశం
రివ్వు రివ్వున
ఎగిరే పక్షులతో...



అనంతపురం నగర శివారులో...

న్యూస్‌బాక్స్

ఫైనల్ పోటీలో ఓడిన సెపక్ తక్రా జట్టు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సెపక్ తక్రా పోటీలలో అనంతపురం జిల్లా బాలుర జట్టుకు ఫైనల్స్‌లో ఓటమి ఎదురైంది. విజయవాడ నగరంలోని పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ అండర్-13 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి కృష్ణా జట్లు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. బాలుర ఫైనల్స్‌లో అనంతపురంపై 15-9, 15-11తో, బాలికల ఫైనల్స్‌లో పశ్చిమగోదావరిపై 15-6, 15-2తో కృష్ణా జట్లు గెలిచాయి. పోటీల్లో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామని పోటీల పరిశీలకుడు ఏపీ రాజు ప్రకటించారు. రాష్ట్ర జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కడం విశేషం.

బాలురు జట్టు: ఎండీ జాకీర్ అహ్మద్, ఎస్.కార్తీక్(కృష్ణా), ఎం. రేవంత్(అనంతపురం), జి.సందీప్(తూర్పుగోదావరి), కె.అభిలాష్(పశ్చిమగోదావరి), బాలికలు: వి.కావ్య, ఎండీ రెహ్మాన(కృష్ణా), కె.వర్షిణి(పశ్చిమగోదావరి), ఎన్ కవిత(నెల్లూరు), ఎం భానుప్రియ(అనంతపురం).

స్టోర్ డీలర్ల భర్తీకి అడుగులు

జిల్లాలో 710 ఖాళీ

అనంతపురం టౌన్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): చౌక ధరల ధాన్యపు డిపో డీలర్ పోస్టుల భర్తీకి టీడీపీ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆశాఖ కమిషనరు జిల్లా శాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న చౌకడిపోలను గుర్తించారు. పౌరసరఫరాల శాఖ అధికారుల లెక్కల మేరకు జిల్లాలో 1645డీలర్ షాపులు ఉన్నాయి. ఇందులో 710 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. డిసెంబరు మొదటివారంలో వీటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఇప్పటికే కమిషనరు, కలెక్టరు ఆదేశాల మేరకు ఆర్డీఓలు డివిజన్లవారీగా ఖాళీలను గుర్తించారు. రెండు వారాలు పాటు దరఖాస్తులు స్వీకరిస్తారు. అనంతరం పోటీపరీక్ష పెట్టి, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అదేరోజే ఎంపికైన అభ్యర్థులకు డీలర్‌గా నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు డీఎస్‌ఓ తెలిపారు.

చీనీ టన్ను రూ. 34వేలు

అనంతపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.34,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 14వేలు, సరాసరి రూ. 21,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 127 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

- ఆర్టీసీ బస్సుపై రాయితో దాడి

అనంతపురం క్రైం,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. పక్కకు తప్పుకోమని ఆర్టీసీ డ్రైవర్ హారన్ కొట్టినందుకు బస్సుపై రాయితో దాడి చేశాడు. ఈ ఘటన అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగింది. నాలుగో పట్టణ ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపిన మేరకు... నగరంలోని జాకీర్ కొట్టాలకు చెందిన అహ్మద్ కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ వైన్‌షాపులో మద్యం తాగి, రోడ్డు పక్కనే నిలబడ్డాడు. అదే సమయంలో అనంతపురం నుంచి రాయదుర్గం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వచ్చింది. అడ్డుగా ఉండటంతో పక్కకు వెళ్లాలని సూచిస్తూ డ్రైవర్ హారన్ కొట్టాడు. అంతే అహ్మద్‌కు కోపమొచ్చింది. మద్యం మత్తులో ... అన్ని సార్లు హారన్ కొడతావా అంటూ అక్కడున్న రాయి తీసుకుని బస్సుపై విసిరాడు. ఈ ఘటనపై బస్సు కండక్టర్ గోపాల్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బాలిక అదృశ్యం...

నగరంలో ఓ బాలిక అదృశ్యమైంది. జనశక్తినగర్‌కు చెందిన బాలిక పదో తరగతి చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి 8.30గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లింది. రాత్రి ఇంటికి రాకపోవడం, సోమవారం ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నర్సు ...

నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తున్న నర్సు ఇంటి నుంచి అదృశ్యమైంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... షిరిడీనగర్‌కు చెందిన నర్సు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆనంద్ ఆసుపత్రిలో పనిచేస్తోంది. భర్త హరితో కలిసి షిరిడీనగర్‌లో నివాసముంటోంది. వీరికి సంతానం లేదు. ఈ క్రమంలో మేఘన ఆదివారం రాత్రి 8గంటల సమయంలో బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త హరి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అహుడాను అగ్రస్థానంలో నిలుపుతా

నూతన అధ్యక్షుడు టీసీ వరుణ్

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం



తరలివచ్చిన పార్టీ శ్రేణులు

అనంతపురం క్రైం/ప్రెస్‌క్లబ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అహుడాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలోకి తీసుకెళ్తామని నూతన చైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. నగరంలోని అహుడా కార్యాలయానికి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పాదాభివందనాలు తెలిపారు. జిల్లాలో జనసేన పార్టీ కొన్నేళ్లుగా ముందుకెళ్తోందని, తమ నాయకుడు తమపై నమ్మకముంచి ఈ పదవి ఇచ్చారని అన్నారు. బాధ్యతగా పని చేసి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 57 మండలాల పరిధిలో అహుడాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళతానని అన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ఎంఐజీ లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. అహుడా పరిధిలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని అన్నారు. అహుడా అనుమతి లేకుండా వేసిన లే అవుట్ల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

తరలివచ్చిన నాయకులు

అహుడా చైర్మన్‌గా టీసీ వరుణ్ ప్రమాణ స్వీకారం చేస్తుండటంతో జనసేన కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. కూటమి నాయకులు భారీగా తరలివచ్చారు. టీసీ వరుణ్‌ను ఆయన నివాసం నుంచి బైకు ర్యాలీ నడుమ అహుడా కార్యాలయానికి తీసుకొచ్చారు. వేద పండితులు, ముస్లిం, క్రిష్టియన్ మతపెద్దలు ఆశీర్వదించారు. అనంతరం టీసీ వరుణ్ ప్రమాణ స్వీకారం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ టీసీ వరుణ్ నివాసానికి వెళ్లి సత్కరించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, మాజీ మేయర్ స్వరూప, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, ఎంపీ అంబికా కుమారుడు వీక్షిత్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రోటరీ క్లబ్ కేశవరెడ్డి, నాయకులు సంపత్, గల్లా హర్ష, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, లిఖిత్‌రెడ్డి, చలపతి పాల్గొన్నారు. అహుడా సెక్రటరీ గౌరీశంకర్, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, డీఈ రేవంత్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకులు

రీచార్జ్ చేస్తేనే కరెంటు..!

విద్యుత్ కనెక్షన్లకు కొత్త స్మార్ట్ మీటర్లు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు
- మొదటి విడతలో 2.93లక్షల మీటర్లు బిగింపు
- మొబైల్ రీచార్జ్ తరహాలో ప్రీపెయిడ్ చేయాల్సిందే

అనంతపురంరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యుత్ సంస్థ కొత్త మార్పులకు శ్రీకారం చుడుతోంది. గతంలో విద్యుత్ మీటర్ నెంబరు ఆధారంగా నెలవారి బిల్లు ఇచ్చేవారు. ఆ తరువాత మెషీన్ల ద్వారా రీడింగ్ స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు ఇచ్చేవారు. ఇప్పుడు కొత్తగా స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టారు. మొబైల్ ఫోన్‌కు ఏవిధంగా అయితే రీచార్జ్ చేసుకుంటే పనిచేస్తాయో...అదే రీతిలో ఈ స్మార్ట్ మీటర్లు పనిచేయనున్నాయి. ఇది విద్యుత్ సంస్థలు, వినియోగదారులకు ఉభయ కుశలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2.93లక్షల కనెక్షన్లకు బిగింపు

ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో ఈ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 15.96లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు సంబంధించి 11.21లక్షలు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు 1.21లక్షలు, పరిశ్రమలు, 11,591, తాగునీటి పథకాలు, వీధిదీపాలు, మున్సిపాలిటీలు సంబంధించి 26,061, వ్యవసాయ కనెక్షన్లు 3.15లక్షల కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో రెండు వందల యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగం చేస్తున్న గృహ, పరిశ్రమలు, వాణిజ్య, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఉపకేంద్రాల్లో 11కేవీ, 33కేవీ ఫీడర్లు, హెవీ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతలో భాగంగా ఆయా సర్వీసుల్లో ఎంపిక సర్వీసుల మేరకు 2,93,310 కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో 17,333 మీటర్లు బిగించారు. ఇందులో అనంతపురం డివిజన్‌లో 4006, గుత్తిలో 5121, కళ్యాణదుర్గం 2325, పుట్టపర్తి డివిజన్ 1252, కదిరి డివిజన్‌లో 1668, హిందూపురం డివిజన్‌లో 2961 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

మొబైల్ రీచార్జ్ తరహాలో ప్రీపెయిడ్

విద్యుత్ శాఖ ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు మొబైల్ రీచార్జ్ తరహాలో పని చేయనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెబుతున్నారు. ఈ యాప్ ద్వారా మొబైల్ ఫోన్ ద్వారా తమ ఇంటి కరెంటు సర్వీసు నెంబరు నమోదు చేసుకుని తద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే సౌలభ్యాన్ని తీసుకొనిరానున్నట్లు వెల్లడిస్తున్నారు. వినియోగదారులు ఎంత సొమ్ము అయితే రీచార్జ్ చేసుకుంటారో ఆ సొమ్ము అయిపోయేంతవరకు సరఫరా ఉంటుందని చెబుతున్నారు. మొబైల్ రీచార్జ్ తరహాలోనే విద్యుత్ రీచార్జ్ డబ్బు అయిపోయే వారం రోజుల ముందు నుంచి ఫోన్‌లకు సమాచారం వస్తుందని అంటున్నారు. ఒక వేళ రీచార్జ్ తేదీ గడువు ముగిసినా సరఫరా ఆగిపోకుండా కొంత సమయం ఉంటుంది. ఆ సమయం ముగిస్తే ప్రస్తుతం ఏవిధంగా అయితే అపరాధ రుసుముతో చెల్లించే వీలుంటుందో అదేవిధంగా చెల్లించేందుకు అవకాశం కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ ఇప్పటికీ ఇంకా మొదలు కానప్పటికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తి అయిన తరువాత ప్రారంభం అయ్యే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

సేవలు మరింత సులభతరం చేయడానికి...

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వినియోగదారులకు అందించే విద్యుత్ సేవలను మరింత సులభతరం చేయడానికేనని విద్యుత్ అధికారులు అంటున్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఎంత విద్యుత్ వినియోగం జరిగితే ఆమేరకు డబ్బు కట్ అవుతుంది. చాలా మంది తమకు ఎక్కువ బిల్లు వస్తోందని చేస్తున్న ఫిర్యాదులకు పరిష్కారం దొరుకుతుంది. ఇంట్లో రోజువారిగా ఎంత కరెంటు వినియోగిస్తున్నాం. ఏ ఎలక్ట్రానిక్ వస్తువు ఎంత కరెంటు లాగింది వంటి విషయాలను తెలుసుకునే వీలుంటుందని చెబుతున్నారు. వినియోగదారులు క్యూలైన్‌లో నిలబడి బిల్లులు చెల్లించే పని లేకుండా ఇళ్లలో నుంచే విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఎప్పటికప్పుడు మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ సర్వీసుకు రీచార్జ్ చేసుకునే సౌకర్యం ఉంటుంది. స్మార్ట్ మీటర్లలో ఏర్పాటు చేసిన ఇన్‌బిల్ట్ సిమ్ ద్వారా మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే అవకాశం ఉంటుంది. ఎన్ని యూనిట్లు వినియోగించాం. రీచార్జ్ ఎంత చేశాం. ఎప్పుడు ముగుస్తుంది వంటి వివరాలు ఆన్‌లైన్ ద్వారా వినియోగదారులు తెలుసుకునే వీలుంటుంది.



నారాయణపురం పంచాయతీ కార్యాలయానికి ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

సేవలను చేరువ చేసేందుకే...



వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేందుకు ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు జరుగుతోంది. వినియోగదారులకు వచ్చే సమస్యలను ఇందులో సులభంగా తెలుసుకోవచ్చు. విద్యుత్ ఎక్కడ వృథా అవుతోంది. సమస్యలు ఎక్కడ తలెత్తుతున్నాయి వంటి విషయాలను క్షేత్రస్థాయిలోని అధికారులతోపాటు మేము తెలుసుకునేందుకు వీలుంటుంది. అందుకు అనుగుణంగా పనులు చేస్తే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు సంస్థకు నష్టాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుంది.

- సంపత్ కుమార్, ఎస్ఈ విద్యుత్ శాఖ

ప్రజా ధనం రాళ్ల పాలు..!



వెస్టునరసాపురం సచివాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న రీసర్వే రాళ్లు

వృథాగా పడి ఉన్న రీసర్వే రాళ్లు

నాటడానికి ఒప్పుకోని కొందరు రైతులు

శింగనమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే పేరుతో వైసీపీ ప్రభుత్వం రైతులకు వారి పొలాల సరిహద్దులు చూపి, నాటడానికి తెచ్చిన రాళ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లో సైతం ఈ రాళ్లను పూర్తిగా వాడలేదు. దీంతో కొన్ని రైతుల పొలాల వద్ద, గ్రామ సచివాలయాల వద్ద వృథాగా పడి ఉన్నాయి. జగన్ బొమ్మ ఉన్న ఈ రాళ్ల కోసం అప్పట్లో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిందనే విమర్శలు వినిపించాయి. అయితే రీ సర్వేను తప్పుల తడకగా చేశారని ఆరోపిస్తూ పలువురు రైతులు రాళ్లు నాటడానికి ఒప్పుకోలేదు.

ఒక్కో రాయికి రూ.450 ఖర్చు

మండలంలోని 11 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి కావడంతో 10 గ్రామాలకు 8వేలకు పైగా సర్వేరాళ్లు వచ్చాయి. అయితే సరిహద్దులు సక్రమంగా వచ్చి, రైతులు ఒప్పుకున్న చోట మాత్రమే ఈ రాళ్లను పూడ్చారు. అలా ఇప్పటి వరకు దాదాపు రెండు వేల రాళ్లను పూడ్చినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వాటిలో కొన్ని రాళ్లను సచివాలయాలు, గ్రామ నౌకర్ల దొడ్లలో ఉంచారు. చాలా గ్రామాల్లో రైతుల పొలాల్లో వేసినా, వాటిని హద్దులకు పూడ్చలేదు. ఈ సర్వే రాయి విలువ ఒక్కొక్కటి రూ.450పైమాటేనని అధికారులు చెబుతున్నారు. రాయి, దానిమీద జగన్ బొమ్మతో కలిపి రూ.300 టెండర్ అని, దాన్ని పొలం హద్దు వద్ద పూడ్చడానికి మరో రూ.150 ప్రభుత్వం నుంచి వచ్చింది.

రాళ్లు పూడ్చనివ్వలేదు: గంగిరెడ్డి, రైతు



మా ఊరు రాచేపల్లిలో రీసర్వే పనులు చేపట్టారు. అయితే ఎక్కడా సర్వే సక్రమంగా పూర్తి కాలేదు. భూ విస్తీర్ణాలు హెచ్చు తగ్గులు రావడంతో రాళ్లను పూడ్చనివ్వలేదు. రీసర్వే పనులకు నిధులను దుర్వినియోగం చేశారు తప్ప రైతులకు ఎక్కడ మేలు జరగలేదు.

సర్వే రాళ్లను వద్దన్నాం: లక్ష్మిరెడ్డి, రైతు



మాది నిదనవాడ గ్రామం. రీసర్వే పనుల్లో భూముల విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. జగనన్న భూహక్కు పుస్తకం ఇవ్వడానికి గ్రామసభ ఏర్పాటు చేశారు. అప్పుడు రైతు అందరు కలసి మా భూముల వివరాలు ఖచ్చితంగా వచ్చే వరకు పుస్తకాలు తీసుకోమని తెగేసి చెప్పాం. రీ సర్వే రాళ్లు తీసుకొస్తామని అధికారులు తెలిపిన మా సమస్య పరిష్కరించేవరకు వద్దన్నాం.

రైతులు ఒప్పుకున్న చోటే నాటాం




రీసర్వే తరువాత ఇప్పటికే ఎల్‌సీ నంబర్లు ఇచ్చి పాసుపుస్తకాలు రైతులకు అందజేశాం. అయితే రైతులు ఒప్పుకున్న చోటే సరిహద్దులకు సర్వే రాళ్లను నాటాం. రైతులను బలవంతం చేసి ఎక్కడానాటలేదు.

- పునీత్‌బాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్

30న జిల్లాకు సీఎం చంద్రబాబు రాక

రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటన



అనంతపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 30న జిల్లాకు రానున్నారు. జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలంలో ఏదైనా ఒక గ్రామంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన అధికారికంగా వెలువడాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి పర్యటన దాదాపుగా ఖరారైనట్లు ఆ పార్టీ ముఖ్య నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికే రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బొమ్మనహాళ్ మండలంలో ఏ గ్రామంలో చంద్రబాబు పర్యటించాలో అందుకు అనుగుణంగా ఆ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే ప్రతినెలా ఏదో ఒక జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములవుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు రచ్చబండ తరహాలో... ఆ గ్రామ ప్రజలతో ముఖ్యమంత్రి సమావేశంకానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోంది.

ఎన్టీఆర్ ట్రస్టు స్కాలర్‌షిప్‌ను సాధించండి

ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన



పరీక్ష ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహించే గర్ల్స్ ఎడ్యుకేషన్ స్కాలర్ షిప్ పరీక్షలో ప్రతిభ చాటి ఉపకార వేతనం పొందాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన ఎన్టీఆర్ కళాశాల ప్రతినిధి కృష్ణారెడ్డితో కలిసి పరీక్షా ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికలకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నారన్నారు. డిసెంబరు 8న హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ కళాశాలలో స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షల్లో మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు నెలకు రూ.5వేలు చొప్పున, ఆ తర్వాతి 15 ర్యాంకులకు నెలకు రూ.3వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేస్తారన్నారు. వివరాల కోసం 9908551643, 7660002627, 7660002628 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

జల్‌జీవన్ మిషన్ పథకం అమలుపై ఆరా



నీటి నాణ్యత పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కేంద్ర కమిటీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్ జీవన్ మిషన్ పథకం అమలు తీరుపై నేషనల్ జలజీవన్ మిషన్ సభ్యులు జాలి కేశవన్, సురేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఉదయం ఈఈ మురళీధర్‌రావు, ఎస్ఈ పీఏ, డీఈ శ్రీరాములుతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని ఎస్ఈ చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. పథకం అమలుపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని పిలిపించి క్షేత్రస్థాయిలో అమలు తీరుపై ప్రశ్నించారు. సిబ్బంది సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్లు సమాచారం. అయితే డీఈ, ఈఈలు దగ్గర ఉండటంతో తగిన విధంగా వివరణ ఇచ్చారు. అనంతరం శింగనమల డివిజన్ కార్యాలయం సమీపంలో ఉన్న నీటి శుద్ధి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈలు శ్రీరాములు, రేహానా వసీంలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి స్థానిక ప్రజలతో పథకం అమలుపై ఆరా తీశారు. గుత్తి మండలంలోని పాతకొత్తపేట, పామిడి మండలంలోని ఎద్దులపల్లి, బుక్కరాయసముద్రం మండలంలోని వడియం పేట తదితర ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ పథకం అమలు తీరును పరిశీలించారు.

ఉద్యోగ కల్పనలో గేమ్ చేంజర్

పీఎం ఇంటర్న్‌షిప్

500 కంపెనీల్లో కోటిమందికి ఉద్యోగాలు

మంత్రి సత్యకుమార్ యాదవ్



ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కల్పిస్తున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం సెంట్రల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ఉద్యోగ కల్పన గేమ్‌చేంజర్ అని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో పీఎం ఇంటర్న్‌షిప్ పథకంపై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. తమ పిల్లలు ఉద్యోగాలను సంపాదించి, స్థిరపడాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులు కష్టాలకోర్చి చదివిస్తున్నారన్నారు. డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు పూర్తిచేసినా సరైన ఉద్యోగావకాశాల్లేక తల్లిదండ్రుల కలలు నెరవేడంలేదన్నారు. దేశంలో పారిశ్రామిక, ఐటీ తదితర రంగాలు అభివృద్ధి చెందుతున్నాయనీ, వాటిలో ఉద్యోగం పొందాలంటే సంస్థలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అవసరమన్నారు. ఏటా లక్షలమంది విద్యార్థులు కళాశాలల్లో విద్యను పూర్తిచేసుకుని బయటకు వస్తున్నా నైపుణ్య లోపంతో ఉద్యోగాలు పొందడం లేదన్నారు. ఈ సమస్యలను అధిగమించి విద్యార్థులు, సంస్థలకు అనుసంధానం చేసేలా ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చారని తెలిపారు. కోటిమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించేందుకు దేశవ్యాప్తంగా 500 కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఫార్మసీ తదితర కోర్సులు, అర్హతకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇస్తే కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పొందేందుకు దోహదపడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 12 నెలలు సంబంధిత కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పూర్తవుతుందన్నారు. అనంతరం ఆయా కంపెనీలు ఉద్యోగులుగా అడాప్ట్ చేసుకుంటాయన్నారు. ఇతర కంపెనీల్లోనైనా ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. స్వయం ఉపాధి పొందవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నిర్వాకం..!

- మూణ్ణాళ్ల ముచ్చటగా రోడ్డు పనులు
- రూ.కోటితో వేసిన రోడ్డు గుంతలమయం


ఉండబండ వద్ద నడి రోడ్డుపై ఉన్న గుంత


ఉండబండ ఆలయం వద్ద రోడ్డు దుస్థితి

విడపనకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి-ఉరవకొండ ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రయాణం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. రూ.కోటి నిధులతో రెండేళ్ల కిందట నాలుగు కిలోమీటర్లు రోడ్డు పనులు చేశారు. మూడో కిలోమీటర్ నుంచి ఐదో కిలోమీటర్ వరకూ, 12.2వ కిలోమీటర్ వద్ద నుంచి 10.2వ కిలోమీటర్ వరకూ మొత్తం నాలుగు కిలోమీటర్లు తారు రోడ్డు వేశారు. ఈ రోడ్డు కనీసం రెండు సంవత్సరాలు కూడా చక్కగా నిలబడలేదు. ఎక్కడికక్కడ గుంతలు పడిపోయింది. వాహనాలు తీరగటానికి వీలు లేకుండా మారింది. మోకాలి లోతు గుంతలు పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు ఆందోళనతో ప్రయాణం చేస్తున్నారు. ఉరవకొండ నుంచి ఉండబండ, పాల్తూరు, హావళిగి గ్రామాలకు కర్ణాటక సరిహద్దు రూపనగుడి వరకూ రోడ్డు పూర్తిగా శిథిలమై పోయింది. ఈ 15కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటేనే దాదాపుగా రెండు గంటలు పైగా సమయం పడుతోంది. అప్పట్లో వైసీపీ నేతలు రోడ్డుపై తారును పూతగా వేసి వదిలేశారు దీంతో పైపూత మొత్తం పోయింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు రూ.4 కోట్లు మంజూరు చేసింది.

ఎక్కడా గుంతలు పడలేదు: కావ్య, ఏఈ, ఆర్అండ్‌బీ, ఉరవకొండ

2022లో కోటి రూపాయలతో 3 నుంచి 5 కిలోమీటరు వరకూ, 12 నుంచి 14వ కిలోమీటరు వరకూ తారు రోడ్డు వేశారు. కానీ ఎక్కడా గుంతలు పడలేదు. రోడ్డును నాణ్యంగానే వేశారు. పాల్తూరు దాటిన తరువాత కొంత మంది రైతులు తమ పొలాలకు పైపులు వేసుకునేందుకు రోడ్డును తవ్వటంతో అక్కడ అక్కడ గుంతలు పడి శిథిలమయ్యింది. ప్రస్తుతం 0 నుంచి 11 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 4కోట్లు, హావళిగి గ్రామం వద్ద నుంచి 15వ కిలోమీటరు నుంచి 19వ కిలో మీటరు కర్ణాటక సరిహద్దు రోడ్డు వరకూ నాలుగు కిలోమీటర్లకు రూ.35లక్షలు మంజూరు అయ్యాయి. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.


హావళిగి గ్రామం వద్ద రోడ్డు దుస్థితి


పాల్తూరు వద్ద శిథిలమైన రోడ్డు

క్రైం కార్నర్

పేకాట స్థావరంపై దాడి

- 26 మంది అరెస్టు
- రూ.13.18 లక్షలు స్వాధీనం


అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

శింగనమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువెందుల మొబైల్ పేకాట శిబిరంపై ఎస్పీ జగదీష్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ఆదివారం రాత్రి దాడులు నిర్వహించింది. తాడిప్రతికి చెందిన మొబైల్ గ్యాంబ్లిగ్ నిర్వహకుడు కడప, తాడిప్రతి, అనంతపురానికి చెందిన 40 మందితో మొబైల్ పేకాట ఆడిస్తున్నట్లు సమాచారం రావడంతో మెరుపు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 26 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,18,560 నగదు, నాలుగు బైకులు, ఒక కారు, 23 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టు ఎదుట హాజరుపరిచామని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు. పేకాట నిర్వాహకుడు ఖాదర్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. రాచేపల్లికి చెందిన ఆదితో కలిసి ఖాదర్ పేకాట నిర్వహిస్తున్నాడని తెలిపారు. వీరిద్దరూ మద్యం, వ్యసనాలకు బానిసలయ్యారని, సులువుగా డబ్బులు సంపాదించేందుకు మొబైల్ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. గార్లదిన్నె సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరగడంతో పోలీసులు బిజీగా ఉన్నారని, తమ గురించి పట్టించుకోరని భావించి.. ఇరువెందల వద్ద ముళ్ల పొదల్లో పేకాట ఆడించారని తెలిపారు.

న్యూస్ బాక్స్

ప్రజలకు ఉత్తమ సేవలు అందించండి

- కమాండెంట్ మహేష్ కుమార్



అనంతపురం క్రైం, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని ప్రజలకు మంచి సేవలు అందించాలని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జి కమాండెంట్ మహేష్ కుమార్ సూచించారు. నగరంలోని పరేడ్ మైదానంలో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని హోంగార్డ్స్ పరేడ్‌ను సోమవారం నిర్వహించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో గుర్తు చేసుకోవాలని అన్నారు. విధులు సవాళ్లతో కూడుకున్నవేనని, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్ఐ మధు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు గుంతకల్లు, గుత్తి మీదుగా శబరిమలకు 18 ట్రిప్పుల రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-కొట్టాయం (నం. 07133) ప్రత్యేక రైలు డిసెంబరు 5, 12, 19, 26 తేదీల్లో (గురువారాలలో) కాచిగూడలో మధ్యాహ్నం 3.40కి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6-50 గంటలకు కొట్టాయం చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07134) డిసెంబరు 6, 13, 20, 27 తేదీల్లో(శుక్రవారాలలో) కొట్టాయంలో రాత్రి ఎనిమిదిన్నరకు బయలుదేరి, మరుసటిరోజు రాత్రి 11-40 గంటలకు కాచిగూడకు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, కోయంబత్తూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. హైదరాబాద్-కొట్టాయం ప్రత్యేక రైలు (నం. 07135) డిసెంబరు 3, 10, 17, 24, 31 తేదీల్లో (మంగళవారాలలో) హైదరాబాదులో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4-10 గంటలకు కొట్టాయంకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07136) డిసెంబరు 4, 11, 18, 25, జనవరి 1వ తేదీలలో (బుధవారాలు)సాయంత్రం 6-10 గంటలకు కొట్టాయంలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11-45 గంటలకు హైదరాబాదుకు చేరుతుందని తెలియజేశారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, శంకర్‌పల్లి, వికారాబాద్, తాండూరు, సేరం, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం స్టేషన్ల మీదగా వెళ్తుందని వివరించారు.

రైల్వే స్టేషన్లలో క్యూఆర్ కోడ్స్ ఏర్పాటు

నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహించడం కోసం రైల్వే శాఖ పలు రైల్వే స్టేషన్లలోని పార్సల్ ట్రాన్స్‌పోర్టేషన్ కార్యాలయాల్లో డబ్బు చెల్లించడానికి క్యూఆర్ కోడ్స్‌ను ఏర్పాటు చేయడానికి రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. దక్షిణ మధ్య రైల్వేలోని ఆరు డివిజన్లలో 35 రైల్వే స్టేషన్లలో పార్సిల్ కేంద్రాలలో క్యూఆర్ కోడ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని డివిజనల్ కేంద్రంతోపాటు కడప, అనంతపురం, రాయచూరు, ధర్మవరం, తిరుపతి, రేణిగుంట, డోన్, చిత్తూరు రైల్వే స్టేషన్లలో ఈ ఏర్పాటు చేయనున్నారు.

తుస్సుమన్న ఓటీఎస్..!

- గత సర్కార్ మోసం
- జిల్లాలో 33,043 మంది లబ్ధిదారులు
- రూ.19 కోట్ల చెల్లింపు
- ఏళ్లు గడుస్తున్నా అందని పత్రాలు
- నగదు వెనక్కి ఇవ్వని వైనం




జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయం

అనంతపురం సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు గత వైసీపీ ప్రభుత్వం చుక్కలు చూపించింది. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రం పేరుతో ఐదేళ్లలో చాలా మంది లబ్ధిదారులతో నగదు కట్టించుకుంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి నిర్దేశిత మొత్తాన్ని చెల్లిస్తే ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) పత్రాలు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వం 2021 డిసెంబరు 8న జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఓటీఎస్ పత్రాలను బ్యాంకులో పెట్టి రుణం పొందవచ్చని వెల్లడించింది. దీనిపై ప్రభుత్వం ఊదరగొట్టింది. ఆశించిన స్థాయిలో పథకం అమలు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 1.47 లక్షల మందిని ఓటీఎస్ కింద అర్హులను గుర్తించగా 33,043 మంది మాత్రమే నగదు చెల్లించినట్లు తెలిసింది. వీరిలో చాలామందికి ఓటీఎస్ పత్రాలు అందించలేకపోవడంతో ఆందోళన నెలకొంది. జిల్లాలో హౌసింగ్ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న వారిలో ఓటీఎస్ కింద 1,47,211 మంది లబ్ధిదారులను గుర్తించి వారి నుంచి రూ. 132.13 కోట్లు వసూలు చేయాలని అప్పటి యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. నానా అవస్థలు పడి 33,043 మంది లబ్ధిదారుల నుంచి రూ. 19 కోట్లు వసూలు చేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాహకంతో జిల్లాలో ఓటీఎస్ లబ్ధిదారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. నగదు చెల్లించినప్పటికి ఏళ్ల తరబడి ఓటీఎస్ పత్రాలు ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. గుంతకల్లు, ఉరవకొండ, శింగనమల, రాయదుర్గం ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని సమాచారం. వీటికి తోడు ప్రభుత్వం కూడా మారడంతో తమను పట్టించుకునే వారే లేరని బాధితులు వాపోతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇప్పటికీ 30 శాతం మందికి పత్రాలు అందలేదని ఆ శాఖ వర్గాల నుంచి తెలుస్తోంది. సంబంధిత అధికారులను అడిగితే పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి నగదు చెల్లించిన వారికి ఓటీఎస్ పత్రాలు కానీ.. చెల్లించిన నగదుకానీ వెనక్కి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.


నగర శివారులోని జగనన్న లేఅవుట్

ప్రభుత్వానికి నివేదించాం



ఓటీఎస్ లబ్ధిదారుల్లో కొందరికి పత్రాలు కానీ, చెల్లించిన నగదు కానీ అందలేదన్నది వాస్తవమే. జిల్లాలో నియోజకవర్గాల వారిగా లబ్ధిదారులను గుర్తించి సమగ్ర సమాచారంతో ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదించాం. ఈ ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సదరు లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. **- శైలజ, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ**

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

- 5 నుంచి ప్రక్రియ
- 194 సంఘాలకు ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నిలకు షెడ్యూల్ ప్రకటించారు. సాగునీటికి ప్రధాన పునాదిగా ఉన్న వాటర్ యూజర్ అసోసియేషన్ (డబ్ల్యూయూఏ) సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు శ్రీకారం చుట్టారు. హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194 సాగునీటి సంఘాల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. మొదట అక్టోబరు 16 నుంచి నవంబరు 24వతేదీలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల పరిధిలోని ఆయా ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిసెంబరు 5 నుంచి 8వతేదీలోపు సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని తాజాగా కొత్త షెడ్యూల్ విడుదల చేసింది.

ఇదీ ఎన్నికల షెడ్యూల్

జలవనరుల శాఖలో కీలకంగా వ్యవహరించే సాగునీటి ఆయకట్టు (సాగునీటి వినియోగదారులు) సంఘాలను ఎన్నుకుంటారు. డిసెంబరు 5న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 8న జిల్లావ్యాప్తంగా ఉన్న 194 సాగునీటి సంఘాల ఎన్నిక, అదే రోజు సర్వసభ్యసమావేశాలు నిర్వహిస్తారు. 11వ తేదీన జిల్లాలోని 12 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. 14న తుంగభద్ర, భైరవానితిప్ప ప్రాజెక్ట్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కమిటీలను ఎన్నుకుంటారు.

194 సంఘాలకు ఎన్నికలు

జిల్లాలో మొత్తం 194 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలవ (టీబీపీ హెచ్చెల్సీ) పరిధిలో 99 సాగునీటి సంఘాలను గుర్తించారు. ఇందులో హెచ్ఎల్ఎంసీ 11 సాగునీటి సంఘాలకు 35,541 ఎకరాలు ఉంది. మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ 5 సంఘాలకు 13,325 ఎకరాలు, మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్ 10 సంఘాలకు 29,577 ఎకరాల ఆయకట్టు ఉంది. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 25,478 ఎకరాల ఆయకట్టుకు 9 సంఘాలు ఉన్నాయి. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 11 సంఘాల కింద 32,072 ఎకరాల సాగు ఉంది. అనంతపురం జిల్లాలో 5డిస్ట్రిబ్యూటరీ సంఘాల పరిధిలో 46 సాగునీటి సంఘాలు ఉన్నాయి. మొత్తం హెచ్చెల్సీ పరిధిలో 12డిస్ట్రిబ్యూటరీల కింద 99సాగునీటి సంఘాలను గుర్తించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో జిల్లాలో 95 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మేజర్ ప్రాజెక్ట్‌గా భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్ట్ కింద 6, చెరువులు 89 మొత్తం 95 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో అసోసియేషన్‌కు 20-50 ఎకరాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా టీసీని ఎన్నుకుంటారు. టీసీ (టెరిటోరియల్ కాన్‌స్టియెన్సీ)లు కనీసం 6-12 మంది కలిసి వాటర్ యూజర్ అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు, ప్రభుత్వ కాలేజీల్లో పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ కోటాలో భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉన్నత విద్యాశాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. సెట్‌లో అర్హత సాధించనివారు, పీజీసెట్‌కు హాజరుకానివారికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించవచ్చని ఉన్నత విద్యామండలికి స్పష్టంచేశారు. ఈ కోటాలో అడ్మిషన్లు పొందేవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదన్నారు.

ఎస్ఎంసీ విధులపై స్పష్టత ఇవ్వాలి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) విధులపై స్పష్టతనిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్ఎంసీలకు నిర్దేశించిన పనుల భారం ఉపాధ్యాయులపై పడకుండా చూడాలన్నారు. అలాగే ఎస్ఎంసీలు మరింత బలోపేతం కావాలంటే వారికి గౌరవ వేతన ఇవ్వాలని సూచించారు.

హత్యకేసు నిందితుడిని పట్టించిన పెండ్లి పత్రిక

- 26ఏళ్ల క్రితం పసిబిడ్డను హతమార్చి పరారైన తండ్రి
- పేరు మార్చుకుని కర్ణాటకలో జీవనం
- మళ్లీ పెళ్లి
- రెండో భార్య కూతురి పెండ్లి పత్రిక ఆధారంగా విచారణ
- నిందితుడి అరెస్టు

పుట్టపర్తి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో కన్నబిడ్డ అని కూడా చూడకుండా ఆరు నెలల పసికందును గొంతు నులిమి అమానుషంగా చంపేశాడు. తోటలో పాతిపెట్టి పరారయ్యాడు. కర్ణాటకలోని మారుమూల ప్రాంతానికి చేరాడు. పేరు మార్చుకున్నాడు. వేరే పేరుతో ఓ రైతు తోటలో పనికి చేరాడు. అక్కడే ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు కుమార్తెలు జన్మించారు. ఇలా 26 ఏళ్లు గడిచిపోయాయి. అంతా మరచిపోయారనుకున్నాడు. పోలీసులు పట్టించుకోలేదనుకున్నాడు. ఏమీ కాదులే అనుకున్నాడు. రెండో భార్య కూతురి వివాహానికి స్వగ్రామానికి చెందిన చిన్ననాటి మిత్రుడిని ఆహ్వానించాడు. ఆ మేరకు వివాహ ఆహ్వాన పత్రిక కూడా పంపాడు. అక్కడ దొరికిపోయాడు. ఆ పత్రికను పట్టుకుని పోలీసులు కూపీలాగారు. మాటువేసి, నిందితుడిని పట్టుకున్నారు. 26 ఏళ్ల తరువాత కుమారుడిని చంపిన తండ్రిని అరెస్టు చేశారు. రివార్డులు, అభినందనలు అందుకున్నారు.

గుడిబండ మండలం దిన్నేహట్టిలో 26 ఏళ్ల క్రితం కుమారుడిని హత్య చేసి పరారైన తిప్పేస్వామి అలియాస్ కృష్ణ గౌడను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రత్న వెల్లడించారు. గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి చెందిన గొల్ల తిప్పేస్వామికి 30 సంవత్సరాల క్రితం అదే ఊరికి చెందిన మేనత్త పట్టెమ్మ కుమార్తె కరియమ్మతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు జన్మించారు. భార్య ప్రవర్తనపై తిప్పేస్వామి అనుమానం పెంచుకున్నాడు. చిన్న కుమారుడు శివలింగయ్య (6నెలలు) తనకు పుట్టలేదని భావించిన తిప్పేస్వామి.. పసికందును ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈనేపథ్యంలో 1998 అక్టోబరు 2వ తేదీన ఉదయం దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని దిన్నేహట్టి సమీప పొలాల్లోని మారెమ్మ జమ్మికట్టకు ప్రదక్షిణ చేద్దామని భార్య, కుమారుడిని పిలుచుకెళ్లాడు. కుమారుడు శివలింగయ్యను ఎత్తుకుని కరియమ్మ ప్రదక్షిణ చేస్తుండగా తిప్పేస్వామి పిల్లవాడిని లాక్కుని పరారయ్యాడు. తన మామిడితోటలోకి వెళ్లి చిన్నారిని గొంతునులిమి చంపేశాడు. అక్కడే గొయ్యితీసి, పాతిపెట్టి పారిపోయాడు. దీనిపై కరియమ్మ 1998 అక్టోబరు 18న గుడిబండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడి గాలింపు చర్యలు చేపట్టారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో చార్జిషీట్ దాఖలు చేశారు.

పేరు మార్చుకుని..

కుమారుడిని చంపి పరారైన తిప్పేస్వామి కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ జిల్లా ఆర్దురు గ్రామానికి చేరుకున్నాడు. జవారప్ప వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండేవాడు. పేరు మార్చుకుని కృష్ణగౌడగా వారికి పరిచయమయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన తారను పెళ్లి చేసుకున్నాడు. వీరికి తులసి, సౌమ్య ఇద్దరు కుమార్తెలు జన్మించారు. ఏళ్లు గడిచినా స్వగ్రామం దిన్నేహట్టిలోని స్నేహితుడు గొల్ల నాగరాజు అలియాస్ బాంబే నాగరాజుతో రహస్యంగా స్నేహం నెరుపుతుండేవాడు. ఈక్రమంలో తిప్పేస్వామి తండ్రి చిత్తప్ప ముసలివాడు అయ్యాడనీ, మొదటి భార్య కరియమ్మ కూడా గ్రామంలో లేదని బెంగుళూరుకు వెళ్లి పోయిందనీ, కొడుకును చంపిన విషయం గ్రామస్థులు మరచిపోయారనీ, పోలీసుల కేసు కూడా లేదని నాగరాజు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఊరికొచ్చి భూమి భాగపరిష్కారాలు చేసుకోవాలని స్నేహితుడు సలహా ఇచ్చాడు.


నిందితుడిని పట్టించిన పెళ్లికార్డు

అరెస్టు ఇలా..

తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ నాలుగునెలల క్రితం తన చిన్న భార్య తార కూతురు సౌమ్య పెళ్లికి రావాల్సిందిగా వివాహ ఆహ్వాన పత్రికను నాగరాజుకు పంపాడు. నాగరాజు, అతడి భార్య న్యామనహళ్లిలో వివాహానికి హాజరై, వచ్చారన్న విషయం గ్రామస్థులకు తెలిసింది. దీనిపై సమాచారం అందడంతో ఎస్పీ రత్న.. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు.. నాగరాజును విచారించి, పెళ్లి పత్రికను సేకరించారు. నాగరాజు సలహా మేరకు భూముల భాగపరిష్కారం కోసం నెలకిందట దిన్నేహట్టికి తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ వచ్చివెళ్లాడన్న పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేశారు. అందులో భాగంగా సోమవారం భాగ పరిష్కారం కోసం తన తమ్ముడు చిత్తప్ప, చెల్లెలు కంచమ్మతో పెద్దమనుషుల ద్వారా మాట్లాడడానికి మందలపల్లికి వెళ్లేందుకు దిన్నేహట్టి బస్టాండు వద్దకు తిప్పేస్వామి చేరుకున్నాడు. మడకశిర సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్.. సిబ్బందితో కలిసి వలపన్ని అతడిని పట్టుకున్నారని ఎస్పీ వివరించారు. నేరం చేసినవారు ఎప్పటికీ తప్పించుకోలేరన్న విషయం తిప్పేస్వామి అరెస్టు ద్వారా స్పష్టమైందని ఎస్పీ వివరించారు. సమావేశంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిబ్బందికి రివార్డులు

26 ఏళ్లుగా పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడను చాకచక్యంగా పట్టుకున్న పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించారు. రివార్డులను అందజేశారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

సంక్షిప్తం

అహుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న రాయల్ మురళి

అనంతపురం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌కు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం స్థానిక అహుడా కార్యాలయంలో అహుడా చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన టీసీ వరుణ్‌కు రాయల్ మురళి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు గాజుల ఆదెన్న, దండు శ్రీనివాసులు, కురుబ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు రావాలి

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో సోమవారం వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీఎల్ఎన్ మూర్తి ఎమ్మెల్యేని కలిసి శాలువ కప్పి సన్మానించి, గౌతమబుద్ధుడి ప్రతిమను బహూకరించారు. నాయకులు చలపతి, ఈడిగ శ్రీనివాసులు, బెస్త చరణ్, బాబు,హేమంత్, అబ్దుల్, కుమార్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణకు కృషి

గార్లదిన్నె, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కుష్టువ్యాధి నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని టీబీ, ఎయిడ్స్, కుష్టువ్యాధి జిల్లా అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీని ఆమె సోమవారం టీబీ విభాగం వైద్యాధికారి శిరీషతో కలిసి తనిఖీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి గౌతమి, మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 36

అనంతపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్టంగా రూ. 36తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.20 పలికినట్లు ఆయన తెలిపారు.

నేడు రాజ్యాంగ దినోత్సవం

అనంతపు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ఉదయం 10గంటలకు కార్యక్ర మం ఉంటుందని, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

కనకదాస జయంతి వేడుకలు

రాప్తాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండమీదపల్లిలో సోమవారం ఘనంగా కనకదాస జయంతి వేడుకలు నిర్వహించారు. కురవసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజినేయలు, మరూరు పసుపుల ఆది తదితర కురబ నాయకులు కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించండి



సీఎంతో రంగాపురం లక్ష్మీనాయుడు

నార్పల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విజయవాడలో సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం సీఎం చంద్రబాబును టీడీపీ డాక్టర్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రంగాపురం లక్ష్మీనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించాలని కోరారు. అలాగే శింగనమల నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని సీఎంను కోరినట్లు తెలిపారు.

కారులో మంటలు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదుట రామ్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద సోమవారం ఓ కారులో మంటలు చెలరేగాయి. గమనించిన కారు యజమాని ఓబులేసు, కారులో ఉన్న కుటుంబ సభ్యులు వెంటనే బయటకు వచ్చారు. ఎదురుగానే అగ్నిమాపక శాఖ కార్యాలయం ఉండటంతో సమాచారం అందుకున్న వెంటనే జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక శాఖాధికారి లింగమయ్య ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపుచేశారు. దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం జరిగి ఉండవచ్చునని అధికారులు తెలిపారు. రాయదుర్గానికి చెందిన ఓబులేసు వైద్య చికిత్సల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి మారుతీ సుజుకీ ఏస్టార్ వాహనంలో (కేఏ03ఎమ్ఎన్0202) జిల్లా కేంద్రానికి వచ్చారు. తిరుగుప్రయాణంలో రామ్‌నగర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే కారులో మంటలు చెలరేగాయి. ఏసీ గ్యాస్ లీకై, స్పార్క్ రావడంతోనే మంటలు చెలరేగినట్లు వాహన యజమాని చెబుతున్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



పాతూరు వాసవీ ఆలయంలో పార్థివ లింగ పూజల్లో పాల్గొన్న మహిళలు



హెచ్చెల్సీలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఘనంగా కార్తీక పూజలు



మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ఆకాశదీపం వెలిగిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడు యాదవ్, శ్రీధర్ చౌదరి



శివబాలయోగి ఆశ్రమంలో స్వామికి అభిషేకం

అనంతపురం కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవార పూజలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ మాసంలో చివరి సోమవారం కావడంతో జిల్లాలోని శివాలయాలు, పరమేశ్వరుడి సమేత అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు వేకువజామునే చన్నీటి స్నానమాచరించి, ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద ఎత్తున శివాలయాలకు చేరుకుని దీపాలు వెలిగించి పరమేశ్వరుడికి హారతులు పట్టారు. జిల్లాకేంద్రంలో మొదటిరోడ్డులోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. ఈ సందర్భంగా స్వామికి ఏకాదశవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి స్వామికి శయనోత్సవ సేవ నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హాజరై ఆకాశ దీపం వెలిగించారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి లక్ష ఒత్తుల దీపాన్ని వెలిగించారు. అదేవిధంగా నగర శివారు బెంగళూరు రోడ్డులోని శివకోటి ఆలయంలో శివకామేశ్వరస్వామికి రుద్రాభిషేం, బిల్వార్చన చేశారు. పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో 108 పార్థివ లింగపూజలు నిర్వ హించారు. తిలక్‌రోడ్డు రామాలయం ఆవరణలోని శివాలయంలో స్వామివారికి అన్నాభిషేకం చేశారు. శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో పరమేశ్వ రుడితో పాటు శంకరాచార్యులకు విశేష పూజలు చేశారు. శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, అనంతేశ్వర స్వామి మూలవిరాట్లను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. తపోవనంలోని చిన్మయా జగదీశ్వరాలయం, పాతూరులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, ఆరోరోడ్డులోని శివాలయం, జడ్పీ ఎదురుగా ఉన్న సాయి గీతామందిరం శివాలయం, పాతూరు విరూపాక్షేశ్వర దేవాలయం, అరవిందనగర్‌లోని సర్వేశ్వరాలయం, హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి దేవాలయం, హౌసింగ్‌బోర్డులోని వెంక టేశ్వర స్వామి దేవాలయ ఆవరణలోని శివాలయంలో నూ ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి జ్యోతులు పట్టారు.



● అనంతపురం కల్చరల్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దేవతా దీక్షదారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నదానం నిర్వహించారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయ ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ దేవతల దీక్షదారులు దాదాపు 500 మందికి భిక్ష అందజేశారు.



● గార్లదిన్నె: మండల కేంద్రంలో సోమవారం రాత్రి అయప్పస్వామి గ్రామోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పడిపూజ, సోమవారం ఉదయం అన్నదానం చేశారు. గురుస్వాములు రాము, గుత్తాలక్ష్మీనారాయణ, గేట్టుక్రిష్టారెడ్డి, వెంకటేష్, బుల్లేరామకృష్ణ, రమణ, చంద్ర, మధు, రవితేజారెడ్డి, జశ్వంత్‌రెడ్డి, నిరంజన్, మనోహర్, రామాంజి, పవన్, నవీన్, కిరణ్ తదితర అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

'గ్యాస్ సిలిండర్ డెలివరీ దందాను అరికట్టాలి'

గార్లదిన్నె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండర్‌పై అదనంగా వసూలు చేస్తున్న డెలివరీ బాయ్‌లపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి శ్రీనాథ్‌చౌదరి, సీపీఐ మండల కార్యదర్శి వన్నూర్ స్వామి పేర్కొన్నారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. సిలిండరు వంట గ్యాస్ ధర రూ. 869 ఉండగా గ్రామాల్లో డెలివరీ బాయ్స్ సిలిండర్‌పై రూ. 950 నుంచి వెయ్యి వరకు తీసుకుంటున్నారన్నారు.

ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

గార్లదిన్నె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌక ర్యం కల్పించాలని రాయలసీమ రైతు సంఘం (ఆర్ఆర్‌సీ) జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రాయలసీమ రైతు సంఘం నాయకులు తహసీల్దార్ బండారు ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారన్నారు.

చిత్రలేఖనంలో 'అనంత లక్ష్మి' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అనంత రాముడు

అనంతపురం విద్య, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చిత్రలేఖన పోటీల్లో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. దీంతో విద్యార్థులను స్కూల్ చైర్మన్ అనంతరాముడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలలో భారతీయ కళలు వారసత్వ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు నిర్వహించారన్నారు. పోటీల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి ఎ. ప్రజ్ఞ సంస్కృతి, వారసత్వ చిత్రాన్ని చక్కగా చిత్రీకరించి జాతీయ స్థాయిలో మెదటి బహుమతి సాధించిందన్నారు. ఇతర విద్యార్థులు సైతం సత్తా చాటారన్నారు. ముఖ్యంగా సంస్కృతి సంప్రదాయాలు మనకు ఎంతో నేర్పుతాయ న్నారు. వాటికి చిత్రరూపం ఇచ్చిన విద్యార్థులు అభిందనీయులని కొనియాడారు. కార్యక్రమంలో సీఏఓ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న ఆర్చరీ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్చరీ జిల్లాస్థాయి ఎంపికపోటీలు ఈనెల 28వ తేదీన విద్యారణ్యస్కూల్ ఆవరణలోని ఎంకే అకాడమీలో నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 9949279330, 9398969691 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు: సీఐ

శింగనమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. శింగనమల పోలీసు స్టేషన్ వద్ద సోమవారం మండలంలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. నిబంధనలను అతిక్రమిస్తే ఆటో సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే.. ప్రమాదాలు దూరం

అనంతపురం విద్య, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు ట్రాఫిక్ నిబంధన లు పాటించాలని, అప్పుడే ప్రమాదాలు దరిచేరవని ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొ న్నారు. సోమవారం హౌసింగ్‌బోర్డు కాలనీలో శ్రీచైతన్య బాలికల హైస్కూల్ వద్ద స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా సేఫ్ ఇండియా కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. చిన్నారులు ప్లకార్డులతో స్థానిక కాలనీల్లో ర్యాలీ చేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ...నిత్య జీవితంలో భాగంగా ప్రయాణాలు చేసే ప్రతి ఒక్కరూ ప్రయాణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాల్లో బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్, సీట్ బెల్ట్ ధరించాలని, రూల్స్‌కు విరుద్ధంగా స్పీడ్ డ్రైవింగ్ కూడా చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనా ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ షమీన, అకడమిక్ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హింసలేని సమాజాన్ని నిర్మించాలి: మాజీ ఎమ్మెల్సీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హింస లేని సమాజాన్ని నిర్మించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో నగరంలోని క్లాక్ టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా శ్రీకంఠం సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హింసలేని సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ముఖ్యంగా మహిళల హక్కులు కాపాడకుండా హింసలేని సమాజాన్ని నిర్మించలేమన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళలు, చిన్న పిల్లలపై అత్యాచార దాడులు పెరిగిపోతున్నాయని, వీటికి ముఖ్య కారణం మాదక ద్రవ్యాలు, మద్యం, అశ్లీల చిత్రాలన్నారు. సోమవారం నుంచి డిసెంబరు 10 వరకు కాలేజీలు, హైస్కూళ్లలో హింస వ్యతిరేక అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యాచార ఘటనలపై ప్రతి జిల్లాలోనూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కమిటీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ నాయకురాళ్లు సుశీల, మహాలక్ష్మి, అనిత, తులసి, కుమారి, షబానా, మాబి, వరలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు తదితరులు పాల్గొన్నారు.

బధిరుల క్రికెట్ పోటీలు ప్రారంభం



నేషనల్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): బధిరుల నేషనల్ అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ టీ20 చాంపియన్ షిప్ పోటీలు సోమవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. బధిరుల క్రికెట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సుమిత్‌జైన్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్ ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరగగా...నిర్ణీత 20 ఓవర్లలో ఏపీ ఆరు వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. ఇందులో అర్వింద్ 63 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఢిల్లీ 13.1 ఓవర్లలో 59పరుగులకే ఆలౌట్ అయింది. ఏపీ బౌలర్ 4వికెట్లు తీసి 132 పరుగుల తేడాతో విజయాన్ని అందించారు. రెండో మ్యాచ్‌లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర జట్లు తలపడగా... మధ్యప్రదేశ్ 16 ఓవర్లలో 100పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బరిలోకి దిగిన మహారాష్ట్ర 14.4 ఓవర్లలో 8వికెట్లను కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. మూడో మ్యాచ్‌లో ఒడిషా, ఉత్తరప్రదేశ్ బరిలోకి దిగా ఒడిషా 15 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఉత్తరప్రదేశ్ 12.3 ఓవర్లలో 86 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఒడిషా 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో హర్యాణా, చత్తీస్‌ఘడ్ తలపడగా...హర్యాణా 15 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 128పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చత్తీస్‌ఘడ్ 15 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 94 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ మేనేజర్ శ్రీదేవి, సీఏఎస్ ఫిన్‌హోం జిల్లా మేనేజర్ దేవరాజ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోచ్ యుగంధర్ రెడ్డి, బధిరుల క్రికెట్ సంఘంరాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా పర్యటన వాయిదా

అనంతపురం విద్య, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోనశశిధర్ జిల్లా పర్యటన వాయిదాపడింది. ఆయన జిల్లాలో ఈ నెల 27, 28 తేదీల్లో పర్యటించనున్నారని మొదట రాష్ట్ర ఆర్‌జేడీ కార్యాలయ అధికారుల నుంచి జిల్లా విద్యాశాఖాధికారులకు సోమవారం ఉదయం సమాచారం వచ్చింది. తొలిసారి ఆయన జిల్లాకు రానుండటంతో విద్యాశాఖాధికారుల్లో టెన్షన్ మొదలైంది. అయితే ఉన్నఫలంగా ఆయన జిల్లా పర్యటన వాయిదాపడినట్లు సాయంత్రం అధికారులకు సమాచారం అందింది. దీంతో ఆ శాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

డ్రోన్ల ద్వారా పహారా

● నేరాలకు చెక్ పెట్టేందుకు పోలీస్‌శాఖ ప్రయోగం

అనంతపురం క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నేరాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు డ్రోన్ల పద్ధతికి శ్రీకారం చుట్టారు. నగర శివార్లలో నేరాలు జరగకుండా డ్రోన్ల ద్వారా నిఘా ఉంచాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. ఆ మేరకు సోమవారం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో మూడు డ్రోన్లు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి, వాటి ద్వారా ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో దాడులు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిని అరెస్ట్ చేసి, వారిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో నేరాలను నియంత్రించడానికి సాంకేతి పరిజ్ఞానం ఉపయోగించి, నేరాలు జరిగేందుకు అవకాశమున్న శివారు ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులపై డ్రోన్‌లను పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఆయుర్వేదిక్ దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

● విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా అయుర్వేదిక్ మందుల దుకాణాలను నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణ హెచ్చరించారు. విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆయన సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయుర్వేదిక్ మందుల దుకాణాల్లో అకిస్మిక తనిఖీలు చేపట్టారు. నగరంలోని నాలుగు దుకాణాల వారు తగిన లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు గమనించామన్నారు. చట్టపరమైన చర్యల కోసం విజయ వాడలోని బోర్డు ఆఫ్ ఆయుష్ విభాగానికి నివేదిక పంపుతామన్నారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, డ్రగ్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రూరల్ కబడ్డీ లీగ్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ, ఆర్డీటీ, వివేకానంద స్పోర్ట్స్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో రూరల్ కబడ్డీ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు శాప్ కోచ్ అనీల్‌కుమార్ తెలిపారు. ఇందులో బాలికల విభాగంలో ఆర్డీటీ, కూడేరు కేజీబీవీ, డీఎస్ఏ, కొకుంట్ల జట్లు పాల్గొంటాయన్నారు. బాలుర విభాగంలో ఆర్డీటీ, డీఎస్ఏ, కొకుంట్ల, తాడిపత్రి జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు.

కరాటే జాతీయ పోటీలకు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన ఎస్‌జీఎఫ్ కరాటే క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ కరాటే పోటీల కు క్రీడాకారులను ఎంపిక చేశారు. రెండు రోజులపాటు స్థానిక అశోక్‌నగర్ డీఎస్ ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. డిసెంబరు మొదటి వారంలో ఢిల్లీలో ని ర్వహించే జాతీయ పోటీలకు ఎంపికైన వివరాలను ఎస్‌జీఎఫ్ రెండు జిల్లాల కా ర్యదర్శులు మొరార్జీయాదవ్, సుగుణాబాయి ప్రకటించారు. అండర్-17 బాలురలో సాయినాగ ఆర్య, ముఖేష్, చంద్ర, అభిషేక్, మోహన్‌సాత్విక్, జస్వంత్, రాహుల్, ధనుష్, హేమంత్, చైతన్‌రెడ్డి, మోహిత్, లక్ష్మీనరసింహ ఎంపికయ్యారు. అం డర్-14లో మహేష్‌కుమార్, ప్రజ్వల్, రిషికేష్, హవేష్, మహ్మద్ గౌస్, కార్తీక్, జస్వంత్, కార్తికేయ, హేమంత్‌కుమార్, కేశవనాంద ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పీడీలు గట్టు నాగరాజు, వేణు, కుమార్ రాజా, ప్రవీణ్‌బాబు, దేవకి తదితరులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మైనార్టీల పథకాలు పునరుద్ధరించాలి

● ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు

అనంతపురం కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని, ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. 48వ డివిజన్‌లో సోమవారం ఐఎంఎం మహిళా కమిటీని ఏర్పాటు చేశారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

రామగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. సోమవారం మండలంలోని నసనకోట, కుంటిమద్ది, పోలేపల్లి, పేరూరు, దుబ్బార్లపల్లి గ్రామాలలో టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదుచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, నాయకులు ఎల్ శ్రీదర్‌నాయుడు, మారుతిప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి

కనగానపల్లి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మహిళలు చైతన్యంతో ముందడుగు వేసి సమాజంలో జరుగుతున్న అకృత్యాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశాలా ఫెర్రర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింసా నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. విశాలా ఫెర్రర్‌తో పాటు ఆర్డీ ప్రమీల, పద్మావతి, సురేష్, రామక్రిష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి

నార్పల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలిక పాఠశాల వద్ద గూగూడు రోడ్డు, పెట్రోల్ బంక్ సమీపంలో, కూతలేరు బ్రిడ్జి ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దారు అరుణ కుమారికి సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్ వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. మూడునెలల వ్యవధిలోను గూగూడు రోడ్డు, పెట్రోల్ బంక్, కూతలేరు బ్రిడ్జి సమీపంలో అనేక ప్రమాదాలు జరిగి మృత్యువాత పడ్డారన్నారు.

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వెల్లువెత్తిన వినతులు

● కలెక్టర్‌కు 662 వినతిపత్రాలు అందించిన ప్రజలు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ భవనంలో సోమవారం డివిజన్ స్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి అధికారులు హాజరయ్యారు. ఇందులో కలెక్టర్‌కు రైతులు, ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు పెద్దఎత్తున సమర్పించారు. సుమారు 662 వినతిపత్రాలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి రావడానికి కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ ఎంతో కష్టపడాల్సి వస్తుందని, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశామని తెలిపారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజల కష్టాలను తనవి భావిస్తున్నానని, వారి సమస్యలు తీర్చడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అమిలినేని

క్లుప్తంగా..

భక్తులకు అన్నదానం

గుంతకల్లు టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాలుగో సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని బుగ్గసంగాల గ్రామంలో వెలసిన బుగ్గసంగమేశ్వర ఆలయంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్. జితేంద్రగౌడ్ సోదరులు భక్తులకు అన్నదానం చేపట్టారు. ముందుగా జితేంద్రగౌడ్, ఆయన సతీమణి సుమిత్రమ్మ స్వామి వారిని దర్శించుకుని పూజలు, అర్చన చేయించారు. అనంతరం సోదరులు శ్రీనాథ్‌గౌడ్, హరినాథ్‌గౌడ్, రాణాప్రతాప్‌గౌడ్ అన్నదానం చేపట్టారు. ఆలయ ఈఓ కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆ ఆలయంలో నిత్యాన్నదానానికి అనంతపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మల్కారి ఆనంద్‌రావు రూ.లక్ష విరాళాను ఈఓ కృష్ణయ్యకు అందజేశారు.

మొక్కజొన్న పంట పరిశీలన

గుంతకల్లుటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంచర్ల గ్రామంలో మొక్కజొన్న పంటను కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్ర వేత్త చెంద్రాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్నకు కత్తెర పురుగు, శనగ పచ్చ పురుగు ఆశించాయన్నారు. వాటి నివారణకు పలు చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఉరవకొండ ఏడీఏ పద్మజ, ఏఓ స్వాతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ షాపులో చోరీ

యాడికి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులోని మణికంఠ మోటార్స్ దుకాణంలో చోరీ జరిగింది. దొంగలు రూ.53వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు శోభన్‌బాబు తెలిపారు. తనకు చెందిన మణికంఠ మోటార్స్ దుకాణంలో ఆదివారం రాత్రి దొంగలు పడి షాపునకు ఉన్న రేకులను వంచి లోపలికి వెళ్లారని, అందులో డ్రాలో ఉన్న రూ.53 వేల నగదు అపహరించారని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు

తాడిపత్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కమ్యూనిటీహాలులో బలిజసంఘం ఆధ్వర్యంలో సోమవారం వనభోజనాలు ఘనంగా జరిగాయి. తొలుత అక్కడే ఉన్న శివకామేశ్వరి, సీతారాముల ఆలయాల్లో కార్తీక మాస పూజల్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలిజ సంఘం వారంతా కలిసికట్టుగా వనభోజనాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు దద్దం సుబ్బరాయుడు, ఓగేటి బాబు, విజయ భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు


వేడుకలో పాల్గొన్న విప్ కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం క్యాంప్ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. తర్వాత పాలతో ఆలయ గోపురాన్ని అభిషేకించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కళ్యాణదుర్గ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఎస్ఆర్సీ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంద మంది యువతకు టైలరింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్, కంప్యూటర్లపై నిర్వహిస్తున్న శిక్షణ సోమవారం పూర్తి అయ్యింది. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ కిట్లును ఎమ్మెల్యే అమిలినేని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా రాజీ పడకుండా వి ధులు నిర్వహించాలని, అప్పుడే గుర్తింపుతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశముంటుందని పేర్కొన్నారు.

యువతికి గాయాలు

తాడిపత్రి, నవంబరు25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురంరోడ్డులో నివాసం ఉంటున్న జయశ్రీ సోమవారం తెల్లవారుజామున బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయానికి బైక్‌లో వెళుతుండగా పుట్లూరురోడ్డు సర్కిల్‌లో కుక్కలు వెంబడించడంతో ఎదురుగా ఉన్న స్తంభాన్ని ఢీకొంది. తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

రేపు హుండీ లెక్కింపు

తాడిపత్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి హుండీని ఈనెల 27న, చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో హుండీని 28వ తేదీన ఉదయం 10గంటలకు లెక్కించనున్నట్లు దేవాదాయశాఖ ఈఓ సోమవారం ప్రకటనలో తెలిపారు. పరకామణి సేవలో పాల్గొనే భక్తులు పంచ, టవల్ ధరించాలని సూచించారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

కళ్యాణదుర్గం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్‌బీ ద్వారా మంజూరైన రూ. 23 కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు.కంబదూరు మండలం కోటగుడ్డం వద్ద 13 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజచేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కోటగుడ్డం నుంచి పేరూరు వరకు ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 14 నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, టీడీపీ కన్వీనర్ శివన్న, మాజీ సర్పంచ్ గాజుల శ్రీరాములు, సీనియర్ నాయకులు దండా వెంకటేశులు, తలారి యర్రిస్వామి అవుల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

అయ్యప్ప ఆలయ పనులకు రూ. 50 వేలు అందజేత..

కంబదూరు చెక్‌పోస్టు ప్రాంతంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనులకు రూ. 50 వేలను అయ్యప్ప మాలాధారులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అందజేశారు. అయ్యప్పస్వామి ఆలయంలో ఫ్లోరింగ్ పనులకు ఆర్థిక సాయం అందజేయాలని అయ్యప్ప మాలాధారులు ఎమ్మెల్యేను కోరగా వెంటనే ఆయన స్పందించి నగదును అందజేశారు.

శెట్టూరు: మండలంలోని కైరేవు గ్రామంలో గ్రామదేవత మారెమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం, ధ్వజస్తంభం, శిఖర, కలశప్రతిష్ఠ కోసం ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు రూ. 25 వేలు వితరణ చేశారు. గ్రామపెద్దలు కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించగా.. రూ. 25 వేలు నగదును అందజేశారు.

శివుడి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

తాడిపత్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్కిల్లో రూ.20లక్షల వ్యయంతో భారీ శివుడి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలందరి సహకారంతో ఈ శివుడి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వీ రవీంద్రా రెడ్డి, సూర్యముని, కాకర్ల రంగనాథ, చింబిలి వెంకట రమణ, ఎంఏ రంగారెడ్డి, సంజీవపురం పవన్, హరినాథ్‌రెడ్డి, నరేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజలో పాల్గొన్న జేసీపీఆర్

రోడ్డు ప్రమాదాలు ఆవేదన కలిగిస్తున్నాయి..

ఇటీవల ఆటో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇది ఎంతో ఆవేదన కలిగిస్తోందని జేసీపీఆర్ పేర్కొన్నారు. ఆటోలో ముందర డ్రైవర్ తప్ప ఎవరు కూర్చోరాదన్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆర్టీఓ అధికారులు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లకు తెలియజేశామని పేర్కొన్నారు. వారు స్పందించకపోతే.. జనవరి నుంచి స్వయానా నేనే వెళ్లి ఆటోలను పరిశీలిస్తానని, డ్రైవర్ పక్కన ప్రయాణికులు కూర్చున్నా.. అధికలోడుతో వెళుతున్నా.. వాటిని సీజ్‌చేయించి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో ప్రముఖుల పర్యటన

బొమ్మనహాళ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 30న మండలంలో పర్యటించనున్నారు. దీంతో అనువైన గ్రామం ఎంపికకు ప్రభుత్వవిప్ కాలవ శ్రీనివాసులు, సీఎంఓ టూర్ కోఆర్డినేటర్ ఇక్బాల్‌షకీల్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఆర్డీఓ వసంతబాబు ఇతర అధికారులు ఉద్దేహాళ్, ఉప్పరహాళ్, ఉంతకల్లు, గోవిందవాడ, నేమకల్లు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ముందుగా ఉద్దేహాళ్‌లోని హైస్కూల్ మైదానం, రచ్చకట్టలను పరిశీలించారు. తర్వాత ఉప్పరహాళ్, ఉంతకల్లు, నేమకల్లు గ్రామాల్లో రచ్చకట్టలను పరిశీలించారు. సీఎం ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడేందుకు అనువైన రచ్చకట్టను పరిశీలించినట్లు అధికారులు వెల్లడించారు. సీఎం పర్యటనను ఏ గ్రామంలో ఏర్పాటు చేయాలన్న విషయం మంగళవారం అధికారికంగా వెల్లడించనున్నారు.

మృతులకు ప్రభుత్వ విప్ నివాళి

బొమ్మనహాళ్/ రాయదుర్గం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు కొత్తపల్లి గిరిబాబు(46) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇటీవల దేవగిరిక్రాస్‌కు చెందిన కొండయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

అదేవిధంగా రాయదుర్గం మండలం 74 ఉడేగోళంలో టీడీపీ సీనియర్ నాయకులు శ్రీకంఠప్ప(65) అనారోగ్యంతో మృతి చెందగా.. కాలవ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు

ఉరవకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు సాగి న ఈ పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఫైనల్‌లో విజయనగరం, కడపజిల్లాల జట్లు తలపడగా విన్నర్‌గా విజయనగరం, రన్నర్‌గా కడప జట్లు నిలిచాయి. తృతీయ స్థానం అనంతపురం జిల్లా జట్టు దక్కించుకుంది. గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేశారు. హెచ్ఎం సత్యనారాయణ పీఈటీలు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

పామిడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే రోగులు మునుపటి హెల్త్ రిపోర్ట్‌ను తీసుకొని రావాలని సూచించారు.

కార్మికులపై కక్షసాధింపు తగదు

తాడిపత్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికులకు, కర్షకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఇది ఎంతమాత్రమూ తగదని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు మండిపడ్డారు. పట్టణంలోని కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ప్రజల సమస్యలను తీర్చని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుపుకొని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అంజి, నరసింహారెడ్డి పాల్గొన్నారు

పేకాటరాయుళ్ల అరెస్టు

డీ .హీరేహాళ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలపనగుడిలో తొమ్మిది మంది పేకాటరాయుళ్లను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు పేకాటస్థావరంపై సిబ్బందితో కలిసి దాడులు చేసి అరెస్టు చేశామన్నారు. అలాగే వారి నుంచి రూ.12900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వీఆర్వో మృతి

తాడిపత్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్యాస్‌గీజర్ లీకై గాయపడ్డ వీఆర్వో వెంకట ప్రశాంత్ బెంగళూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణంలోని శ్వేతదీపంలో నివాసం ఉంటున్న వెంకటప్రశాంత్‌ఈనెల 13న ఇంటిలో స్నానం చేసేందుకు గాను గ్యాస్‌గీజర్‌ను ఆన్‌చేయడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి అంటుకున్నాయి. దీంతో గాయపడ్డ వీఆర్వోను చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య అరుణ, కుమార్తె ఉన్నారు.

పంటకోత ప్రయోగాలు

కూడేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ పొలాల్లో సోమవారం అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. మండలంలోని ఉదిరిపికొండ గ్రామ పొలాల్లో నిర్వహించిన పంట కోత ప్రయోగాలను స్టేట్ డీఈఎస్ జాయింట్ డైరెక్టర్ బసవరాజు పరిశీలించారు. పంట దిగుబడి ఏమీ లేదని, పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని, ఆదుకోవాలని జాయింట్ డైరెక్టర్‌ను రైతులు కోరారు. డీవైఎస్ఓ కృష్ణా నాయక్, ఏఎస్ ఓ ఆశా, వీఆర్ఓ లక్ష్మన్న పాల్గొన్నారు.

రోడ్లపై రోడ్లు ఎలా వేస్తారు?

విడపనకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉప్పర కాలనీ, కురుబ కాలనీలలో సీసీ రోడ్లపై మరలా కొత్తరోడ్లు వేస్తుండడంతో ఆయా కాలనీల వాసులు సోమవారం అడ్డుకున్నారు. గత 5 ఏళ్ల క్రితం కాలనీల్లో సీసీ రోడ్లు వేశారని, అయితే అవే రోడ్లపై మళ్లీ ఇప్పుడు కొత్తరోడ్లు వేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని అన్నారు. ఇలా రోడ్డుపై రోడ్డు వేస్తే తమ ఇళ్లు తగ్గులోకి వెళతాయని, వర్షాలు వచ్చినప్పుడు నీరంతా ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని వాపోయారు. కనుక రోడ్లపై రోడ్లు వేయకూడదని అడ్డుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ సునితాబాయికి ఫిర్యాదు చేశారు. సీసీ రోడ్డు వేయనీయకుండా అడ్డు తగిలితే తమపై కేసులు నమోదు చేయించి అయిన సరే రోడ్డు వేయిస్తామని పలువురు అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన చెందారు. ఉన్నతాధికారులు అయినా స్పందించి రోడ్లపైన రోడ్లు వేయనీయకుండా చూడాలని వారు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాలనీల వాసులు ఎర్రిస్వామి, రాము, శివరాజు తదితరులు ఉన్నారు.

సీఐల బాధ్యతల స్వీకరణ

కూడేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా జీ. రాజు సో మవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఉన్న ఆయ న బదిలీపై ఇక్కడి కి వచ్చారు. ఇంతవరకూ ఇక్కడ పనిచేస్తున్న సీఐ శివరాముడు శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు బదిలీ అయ్యారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐగా యువరాజు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

కళ్యాణదుర్గరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం కదిరిదేవరపల్లి వద్ద సోమవా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన బిక్కి వన్నూరుస్వామి అనే వ్యక్తిని చికిత్స నిమిత్తం కారులో బెంగళూరుకు తీసుకువెళుతుండగా.. కదిరిదేవరపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బిక్కి వన్నూరప్ప, మధుకర్, వసుధ, శివ, మధుసూదన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులకు మరమ్మతులు చేపట్టండి

కళ్యాణదుర్గ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సీపీఎం నాయకులు నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుతప్రసాద్ మాట్లాడుతూ.. కరువు మండలాల జాబితాలో నియోజకవర్గంలోని మండలాలు లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కరువు మండలాల జాబితాలో నియోజకవర్గంలోని మండలాలను చేర్చాలన్నారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టి పూడికతీత పనులు నిర్వహించాలని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

దళారులను నమ్మకండి: ప్రభుత్వ విప్ కాలవ

బొమ్మనహాళ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో వరి రైతులు ధాన్యాన్ని దళారులకు ఇచ్చి మోసపోవద్దని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. బొమ్మనహాళ్ మండలకేంద్రంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో హెచ్ఎల్సీ ఆయకట్టు కింద సాగుచేసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

మున్సిపల్ స్థలాలను కాపాడాలి

టీడీపీ కౌన్సిలర్ల డిమాండ్

గుంతకల్లుటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆజెండా చదువుతుండగా టీడీపీ కౌన్సిలర్లు లేచి రెవెన్యూ అధికారి తారకనాథ్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, అతనిడిపై చర్యలు తీసుకోవాలని వాకౌట్ చేశారు. దీంతో చైర్‌పర్సన్ భవాని అరగంట సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి కౌన్సిల్ సమావేశం ప్రారంభవగా.. టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో చాలా చోట్ల మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. కనుక వాటిని కాపాడేందుకు కంచెలు ఏర్పాటు చేయాలని, హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. అలాగే వార్డుల్లో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని, వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో గుంతల రోడ్లను బాగు చేయాలని అన్నారు. అనంతరం అజెండాలోని అంశాలను ఆమోదిస్తున్నట్లు టీడీపీ కౌన్సిలర్లు తెలిపారు. అలాగే రెవెన్యూ అధికారి తారకనాథ్‌ను సరెండర్ చేయాలని 37మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

భూమి ఇవ్వాలి

కూడేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూడేరు పొలంలోని 535 సర్వే నంబర్‌లోని భూమిని సాగు చేస్తున్న రైతులకు మరోచోట భూమిని కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ఆయన రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా 535 సర్వేనంబర్‌లోని భూమిని కూడేరు, అరవకూరు, కడదరకుంట గ్రామాలకు చెందిన పలువురు రైతులు సాగు చేసుకుంటున్నారని, కాగా ప్రభుత్వం ఆ భూమిని పరిశ్రమలకు కేటాయించిందని, దీంతో సాగు దారులకు మరోచోట భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు మహబూబ్ బాషాకు అందజేశారు. సీపీఎం నాయకులు కరీంసాబ్, వెంకటేష్, చితంబరమ్మ, అలివేలమ్మ, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

నీటిలో పడి వృద్ధుడి మృతి

పామిడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబళ్లపల్లి గ్రామానికి చెందిన టి.చంద్రశేఖర్‌రెడ్డి(75) ప్రమాదవశాత్తు వంకలో పడి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసినట్లు పోలీసులు తెలిపారు. తంబళ్లపల్లికి చెందిన వృద్ధుడు చంద్రశేఖర్‌రెడ్డి గ్రామ సమీపాన వంకపై గల వంతెనపై ఆదివారం రాత్రి మద్యం సేవిస్తూ మత్తులో వంకలో పడిపోయాడు. నీరు ప్రవహిస్తుండడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

శెట్టూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఈబీ దేవి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రిలోని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజేష్, శెట్టూరు వైద్యాధికారి తరుణ్‌సాయి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయాన్నే అర్చకులు మూలవిరాట్‌లకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశాలు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని అర్చనలు చేయించారు. అనంతరం ఆలయాల ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఇతర ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీక దీపాల వెలుగుల్లో ఆలయాలు శోభాయమానంగా కనిపించాయి. రాయదుర్గం పట్టణంలో నీలకంఠేశ్వరస్వామికి కుంభాభిషేకం నిర్వహించారు. 51 మంది మహిళలు పాలబావి నుంచి గంగాజలాలను కలశాలతో ఊరేగింపుగా తెచ్చి నీలకంఠేశ్వరస్వామికి అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. పామిడి భోగేశ్వరాలయంలో శివలింగం ఆకృతిలో దీపాల అలంకరణ ఆకట్టుకుంది.


పామిడిలో శివలింగాకృతిలో దీపాల అలంకరణ